సాక్షి
ఖమ్మం
ఆదివారం, 4, ఆగస్టు, 2024





సాక్షి - కేఎండీసీ ఆధ్వర్యాన నిర్వహించిన డిబేట్‌లో మాట్లాడుతున్న విద్యార్థులు

దోస్తానా.. నయా జమానా..



ఒకప్పుడు పుట్టి పెరిగిన ప్రాంతం, చదువుకునే పాఠశాల, ఆడుకునే మైదానం, ఆకతాయి కబుర్లు చెప్పుకునే పిట్టగోడలే కేంద్రాలుగా స్నేహాలు వర్థిల్లేవి. అయితే కాలం గడుస్తుండగా.. జీవిత ప్రయాణంలో ముందుకు సాగుతున్న కొద్దీ ఈ మిత్రుత్వాలు పలుచనయ్యేవి. మనుషులు, మనసుల మధ్య కూడా అంతరం పెరిగేది. కానీ సోషల్ మీడియాతో సమాచార వ్యవస్థలో విప్లవాత్మక మార్పులొచ్చాయి. దీంతో మనుషుల మధ్య దూరం చెరిగిపోయి మునుపెన్నడూ లేనంతగా పాత స్నేహాలు బలపడుతున్నాయి అనేందుకు స్మార్ట్‌ఫోన్ ఉపయోగిస్తున్న వారంతా ప్రత్యక్ష సాక్షులే! – సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

- సోషల్ మీడియా వేదికగా బలపడుతున్న ఫ్రెండ్‌షిప్
- చిన్ననాటి స్నేహితులను కలుపుతున్న వాట్సాప్ గ్రూపులు
- ఇటీవల పెరిగిన పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు
- సామాజిక మాధ్యమాలతో అండగా నిలుస్తున్న మిత్రులు

నేడు అంతర్జాతీయ ఫ్రెండ్‌షిప్ డే

వాట్సాప్ గ్రూపుల హవా..

సోషల్ మీడియా అందుబాటులోకి వచ్చిన తర్వాత సమాచార వ్యాప్తిలో సామాన్యులు కూడా భాగస్వాములయ్యారు. ఒకప్పుడు ఉత్తరాలు, ఆ తర్వాత కాలంలో ఫోన్లలో మాట్లాడుకునే స్థాయి నుంచి సోషల్ మీడియా సాయంతో దేశ విదేశాల్లో ఉంటున్న వారు సైతం వీడియో కాల్స్ ద్వారా సంభాషణలు సాగిస్తున్నారు. నిత్య జీవితంలో ఎదురయ్యే అనుభవాలు, మార్పులు చేర్పులను ఎప్పటికప్పుడు షేర్ చేసుకునే సదుపాయం వచ్చింది. ముఖ్యంగా వాట్సాప్ గ్రూపులతో సామాజిక సంబంధాల్లో ఊహించని మార్పు వచ్చింది. 90 శాతం మంది మొబైల్ ఫోన్లలో మై ఫ్యామిలీ, టెన్త్ క్లాస్, ఇంటర్, డిగ్రీ పేర్లతో తప్పనిసరిగా వాట్సాప్ గ్రూపులు ఉంటున్నాయి. ఈ గ్రూపుల ద్వారా చిన్ననాటి దోస్తుల నుంచి ఆఫీసులో కొలీగ్స్ వరకు అందరూ నిత్యం టచ్‌లో ఉంటున్నారు. వారి దైనందిన జీవితంలో జరిగే మంచి చెడులను ఎప్పటికప్పుడు పంచుకుంటున్నారు. శుభాకాంక్షలు చెప్పుకుంటున్నారు.

గెట్ టు గెదర్..

ప్రపంచీకరణలో వచ్చిన మార్పులతో వృత్తిగత జీవితంలో పోటీ పెరిగింది. దీంతో సొంత ఊరిని వదిలి పట్టణాలు, నగరాలకు వెళ్లక తప్పని పరిస్థితులు నెలకొన్నాయి. చిన్నప్పటి దోస్తులను కలవాలంటే పెళ్లిళ్లు, పేరంటాలు.. లేదంటే ఊరి జాతరలే వేదికలయ్యేవి. ఇవి కూడా ఎప్పుడో ఒకసారి జరిగేవి. కానీ గత ఐదారేళ్లలో చిన్నప్పటి స్కూల్ ఫ్రెండ్స్ అంతా పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు నిర్వహించుకోవడం పెరిగిపోయింది. దీనికి ప్రధాన కారణం వాట్సాప్ గ్రూపులే. ఒకరు పరిచయమైతే చాలు వారం, పది రోజుల్లోనే ఒకరి తర్వాత ఒకరి కాంటాక్ట్ నంబర్లు సాధించడం, అందరినీ గ్రూపుల్లో చేర్చడం చక చకా జరిగిపోతున్నాయి. బిజీ లైఫ్‌లో పరిగెట్టే మనిషికి చిన్ననాటి దోస్తులు వాట్సాప్ గ్రూపుల్లో 'అరేయ్, ఒరేయ్' అని పిలుస్తుంటే వయసు ఒక్కసారిగా తగ్గిపోయినట్టు అనిపిస్తోంది. పాఠశాల రోజుల్లో చేసిన అల్లర్లు గుర్తు చేసుకుంటూ, అప్పటి ముద్దుపేర్లతో ఆటపట్టిస్తుంటే ఆ వ్యక్తి జీవితంలో స్ట్రెస్ బస్టర్‌గా మారుతోంది. గ్రూప్ ఏర్పాటైన నెల నుంచి రెండు నెలల్లోగానే అంతా కలిసి చాట్ చేసుకోవడంతో పాటు వీడియో కాన్ఫరెన్స్‌ల్లో బాతాఖానీ కొడుతున్నారు. అంతటితో ఆగనివాళ్లు మరో అడుగు ముందుకేసి పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు ఏర్పాటు చేస్తున్నారు.

ఆపదలో అండగా నిలుస్తూ..

సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లోని గ్రూపుల్లో లేదంటే పూర్వ విద్యార్థుల సమ్మేళనాల్లో తమ చిన్ననాటి మిత్రులు ఆపదలో ఉంటే ఆదుకునేందుకు అంతా ముందుకొస్తున్నారు. విషయాన్ని గ్రూపులో చర్చకు పెట్టడం, సాయం చేయాలని నిర్ణయించుకోవడం, ఆ తర్వాత ఒక్కొక్కరుగా యూపీఐ పేమెంట్లు ఒకరికి చేయడం, ఆ వ్యక్తి వెళ్లి ఇబ్బంది పడుతున్న దోస్త్‌కు సాయం అందించడం వంటివి వెనువెంటనే జరిగిపోతున్నాయి. జీవితంలో వెనకబడిన వారికి తోడ్పాటు అందించేందుకూ సిద్ధమవుతున్నారు.

జాగ్రత్తలూ అవసరమే..

ఇక సోషల్ మీడియా ముసుగులో కొందరు అర్జంట్ అవసరం అంటూ, నగదు బదిలీ చేయాలని కోరుతూ మోసాలకు తెగబడుతున్నారు. మరికొందరు అమ్మాయిల ఫొటోలు డీపీగా పెట్టుకుని ఫ్రెండ్స్‌తో చాటింగ్ చేస్తూ స్నేహం అనే పదానికి మచ్చ తెస్తున్నారు.

ప్రతీ సమాచారం వాట్సాప్‌లోనే..



మా గ్రామ పూర్వ విద్యార్థులు, ఉద్యోగులు 'బాణాపురం డైనమెట్స్' పేరిట వాట్సాప్ గ్రూప్‌ను క్రియేట్ చేశారు. గ్రామంలో ఉంటున్న వారితో హైదరాబాద్, ఖమ్మమే కాక ఇతర రాష్ట్రాలు, దేశాల్లో స్థిరపడిన 528 మంది సభ్యులు ఉన్నారు. గ్రామంలో ఉంటున్న మేం మంచీ, చెడు ఏ సమాచారమైనా పోస్ట్ చేస్తాం. దీంతో అందరికీ తెలియడమే కాక అవసరమైన సందర్భాల్లో స్పందిస్తారు. ఈ గ్రూప్ ద్వారా ఎక్కడ ఉన్నా అంతా ముఖాముఖి మాట్లాడుకున్నట్లే అనిపిస్తుంది.

– మరికంటి నాగేశ్వరరావు, బాణాపురం డైనమెట్స్ గ్రూప్

వారధిగా నిలుస్తోంది..



10వ తరగతి వరకు బాణాపురంలో చదువుకున్న మేం 'ఫ్రెండ్స్ ఫర్‌ఎవర్' పేరిట 2015లో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటుచేశాం. తద్వారా ఎక్కడెక్కడో స్థిరపడిన చిన్ననాటి స్నేహితులమంతా సంతోషాలే కాక కష్టాలనూ పంచుకుంటున్నాం. ఆపద సమయంలో తోటి మిత్రులు, వారి కుటుంబ సభ్యులను ఆదుకునేందుకు ఈ గ్రూప్ వారధిగా నిలుస్తోంది. ఎవరికైనా కష్టం వస్తే అందరం ఏకమవడాన్ని గర్వంగా భావిస్తాం. స్నేహబంధం గొప్పదనానికి మా గ్రూపే ఉదాహరణ.

– దీకొండ వెంకటేష్, ఫ్రెండ్స్ ఫర్ ఎవర్ గ్రూప్ సభ్యుడు

స్నేహ మాధుర్యం..



భవిష్యత్ నిర్దేశకులు దోస్తులే

- ఎంచుకునే వేళ జాగ్రత్త పడితే సరి
- తల్లిదండ్రులు కూడా బెస్ట్ ఫ్రెండ్సే..
- సాక్షి – కేఎండీసీ డిబేట్‌లో విద్యార్థుల మనోగతం

ఖమ్మం సహకారనగర్: స్నేహం మధురమైనదంటారా? కాదు అంతకన్నా ఎక్కువే! స్నేహం విలువ, అర్థం మాటల్లో చెప్పడానికి వీలు కాదు. ఎక్కడో పుట్టి.. ఎక్కడో పెరిగి మరెక్కడో ఏర్పడే పరిచయం స్నేహంగా మారి విడదీయరాని బంధంగా బలపడుతుంది. అది స్కూల్, కళాశాల లేదా కార్యాలయం ఎక్కడైనా కావొచ్చు. ఎంచుకునే వేళ కాస్త జాగ్రత్త పడుతూ మన ఆంతరంగాన్ని పోలి ఉండే వారిని స్నేహితులుగా మార్చుకుంటే ఆ బంధం ఇక ఎన్నటికీ వీడిపోదు. నేడు (ఆదివారం) స్నేహితుల దినోత్సవం సందర్భంగా సాక్షి మీడియా, కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాల(అటానమస్) సంయుక్త ఆధ్వర్యాన డిబేట్ నిర్వహించగా డిగ్రీ తృతీయ సంవత్సరం విద్యార్థులు స్నేహబంధం, స్నేహితులపై తమ అభిప్రాయాలు వెల్లడించారు.

స్వార్థం లేకపోతేనే స్వచ్ఛత

భవిష్యత్‌కు స్నేహితులే మార్గదర్శకులుగా నిలుస్తారని పలువురు విద్యార్థులు అభిప్రాయపడ్డారు. ఇలాంటి స్నేహితులు చిన్నతనం నుంచి ఉన్నత స్థాయికి చేరే వరకు ఎక్కడున్నా గుర్తుండి పోతారని తెలిపారు. అయితే, హోదాను బట్టి కాక స్వార్థం లేకుండా కొనసాగితేనే స్వచ్ఛమైన స్నేహమని చెప్పారు. సంతోషాన్ని పంచుకోవడంతో పాటు కష్టం వచ్చినప్పుడు కూడా నేనున్నానంటూ భరోసాగా నిలవడమే గొప్పతనమని అన్నారు.

మారుతున్న స్నేహాలు

గతంలో ముఖాముఖి పరిచయం ఉన్న వారే స్నేహితులుగా మారగా.. ఇప్పుడు ఆన్‌లైన్ స్నేహాలు పెరిగాయని పలువురు చెప్పుకొచ్చారు. ఇష్టాఇష్టాలు, ఇతర అంశాల ఆధారంగా ఒకరికొకరు పరిచయం అవుతున్నారని.. ఆపై స్నేహంగా మారుతోందని తెలిపారు. అయితే, ఇలాంటి విషయాల్లో కాస్త జాగ్రత్తగా ఉండాలని పలువురు అభిప్రాయపడ్డారు.

అమ్మానాన్నలూ మిత్రులే..

కొందరు తల్లిదండ్రులు సైతం తమ పిల్లలతో బెస్ట్ ఫ్రెండ్స్‌లానే ఉంటారని విద్యార్థులు చెప్పుకొచ్చారు. మనం కొన్ని విషయాలు చెప్పడానికి సంకోచించినప్పటికీ.. అన్నీ చెప్పుకుంటే స్నేహితుల్లా స్వీకరించేందుకు వారు ముందుంటారని తెలిపారు. కరోనా తర్వాత తల్లిదండ్రులతో స్నేహం పెరిగిందని కొందరు చెప్పగా.. ఇంకొందరు మాత్రం ఆన్‌లైన్ స్నేహం సైతం పెరిగిందని వెల్లడించారు. కాగా, ఈ డిబేట్‌లో కేఎండీసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కే.వీ.రమణారావు, అధ్యాపకులు, ఉద్యోగులు పాపారావు, కమల్, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

ఎంపికే ప్రధానం



మనం స్నేహితులను ఎంచుకునేటప్పుడే జాగ్రత్త పడాలి. తద్వారా మంచి స్నేహితుల సాంగత్యంలో భవిష్యత్‌కు బాటలు పడతాయి. స్నేహితులంటే నమ్మకానికి మారుపేరు. ఆ నమ్మకంలో తేడా రాకుండా ఉంటేనే విలువ ఉంటుంది. – జి.మేఘమాల

స్నేహంతో విజయం



ప్రస్తుత పరిస్థితుల్లో నిజమైన స్నేహం కావాలి. అలాంటి స్నేహం ఏర్పడితేనే విజయాలు సాధ్యమవుతాయి. ఈ సమయాన మంచీచెడులపై సమగ్రంగా విచక్షణ కలిగి ఉండాలి. తద్వారా స్నేహితులు మన ఉన్నతి, విజయాలకు దోహదపడతారు. – వంశీకృష్ణ

మా పేరెంట్సే బెస్ట్ ఫ్రెండ్స్



నాకు మా తల్లిదండ్రులే బెస్ట్ ఫ్రెండ్స్. నేను ప్రతీ విషయాన్ని మొదట వారికే చెబుతా. నాకు చిన్నప్పటి నుంచి స్నేహితులు ఉన్నప్పటికీ నేను అమ్మానాన్నలే బెస్ట్ ఫ్రెండ్స్‌గా ఫీలవుతా. వారు సైతం నాతో అలాగే ఉండడాన్ని అదృష్టంగా భావిస్తా. – మైలవరపు సరయు

ఆలోచనలు కలవాలి..



ప్రస్తుతం లైక్ మైండెడ్ ఫ్రెండ్స్ కావాలి. చదువు, ఎంచుకునే రంగాల్లో ఇద్దరి ఆలోచనలు ఒకేలా ఉంటే వారి స్నేహం బలంగా కొనసాగుతుంది. అంతేకాక ఎవరైనా తప్పుదారి పడితే సరిచేసే అవకాశముంటుంది. అలాగే, స్నేహం నిజాయితీగా ఉండాలి. – మహేష్

పరస్పరం.. అర్థం



స్నేహమంటే ఒకరిని ఒకరు అర్థం చేసుకోవడం. అలాగే, పరస్పరం పూర్తి నమ్మకాన్ని కలిగి ఉండాలి. కష్టాలు, బాధలు వచ్చినా ఎలాంటి పరిస్థితులు ఎదురైనా నేనున్నానని భరోసా ఇవ్వాలి. అలాంటి స్నేహితులు ఉన్నవారు విజయం సాధిస్తారు. – గాయత్రి

మరువలేనిది.. మరుపురానిది



మరువలేనిది.. మరుపురానిదే స్నేహం. పాఠశాల స్థాయి నుంచి డిగ్రీకి వచ్చినా స్నేహితులను మరిచిపోలేదు. కొందరి జీవితాల్లో స్నేహితులే హీరోలు. చదువు, ఉద్యోగ విషయాల్లో అండగా నిలిస్తే ఉన్నత స్థానాలకు సులువుగా చేరుకునే అవకాశం ఉంటుంది. – ప్రదీప్

న్యూస్‌రీల్

జమలాపురంలో అభిషేకం, నిత్యకల్యాణం



పల్లకీసేవలో పాల్గొన్న అర్చకులు, భక్తులు

ఎర్రుపాలెం: తెలంగాణగా తిరుపతిగా పేరున్న జమలాపురం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామి మూలవిరాట్‌తో పాటు శ్రీవారి పాదానికి అర్చకులు తెల్లవారుజామున పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. ఆతర్వాత స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి నిత్యకల్యాణం జరిపించడంతో పాటు వేలాదిగా హాజరైన భక్తుల సమక్షాన పల్లకీ సేవ జరిపించారు. ఆలయ ఈఓ జగన్మోహన్ రావు, చైర్మన్ శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, సూపరింటెండెంట్ విజయకుమారి పాల్గొన్నారు.

భూగర్భజల శాఖ డీడీగా శ్రీనివాస్

ఖమ్మంవన్‌టౌన్: భూగర్భ జలశాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్‌గా ఎం.శ్రీనివాసరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా హనుమకొండలో పనిచేస్తున్న ఆయనను ప్రభుత్వం ఖమ్మంకు కేటాయించింది. గతంలో ఇక్కడ డీడీగా ఉన్న శ్యాంప్రసాద్ నాయక్ కరీంనగర్‌కు బదిలీ అయ్యారు.

పోడు రైతులకు తిరిగి రుణాలు

ఖమ్మంవ్యవసాయం: పోడు, అసైన్డ్ పట్టాలు కలిగి రుణమాఫీ పొందిన రైతులకు తిరిగి రుణాలు ఇవ్వనున్నట్లు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్(డీసీసీబీ) సీఈఓ అబీద్ ఉర్ రెహమాన్ తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని పీఏసీఎస్‌ల నుంచి కల్పిస్తున్న ఈ సౌకర్యాన్ని రైతులు సద్వినియోగం సూచించారు. కాగా, డీసీసీబీ పరిధిలో తొలి విడత 37,625 మంది రైతులకు రూ.121.63 కోట్లు, రెండో విడతలో 19,504 మంది రైతులకు రూ.88.09 కోట్లు రుణమాఫీ అయిందని తెలిపారు. ఇంకా 1,12,735 మందికి రూ.682.27 కోట్లు మాఫీ కావాల్సి ఉందని సీఈఓ వెల్లడించారు.

'దళితబంధు'లో నిర్లక్ష్యాన్ని ఉపేక్షించేది లేదు

- యూనిట్ల పర్యవేక్షణలో ప్రత్యేకాధికారులు విఫలం
- దుర్వినియోగం చేస్తే రికవరీ.. బాగుంటే రెండో విడత నిధులు ఇస్తాం
- డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క



చింతకాని : మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పక్కన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, తదితరులు

చింతకాని: దళితుల అభ్యున్నతి కోసం దళితబంధు పథకాన్ని ప్రవేశపెట్టినా అధికారుల పర్యవేక్షణ లోపంతో ఆశించిన ఫలితాలు రావడం లేదని డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క పేర్కొన్నారు. చింతకానిలోని రైతువేదికలో శనివారం దళితబంధు అమలుపై ప్రత్యేకాధికారులతో భట్టి సమావేశమయ్యారు. చింతకాని మండలాన్ని పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసి 3,462 లబ్ధిదారులకు యూనిట్లు మంజూరు చేయగా.. అవి ఇప్పుడు లబ్ధిదారుల వద్ద ఉన్నాయా, లేవా అన్న ప్రశ్నకు సరైన సమాధానం రాకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. ఈవిషయంలో లబ్ధిదారులకు పాత్ర ఎంత ఉంటుందో ప్రత్యేకాధికారుల పాత్ర కూడా అంతే ఉన్నందున వారంలోగా అప్పగించాలని ఆదేశించారు. కాగా, లబ్ధిదారులు చిన్నతరహా పరిశ్రమల యూనిట్లను ఏర్పాటుచేస్తే ఇండస్ట్రియల్ పార్క్ మంజూరు చేస్తామని తెలిపారు. జేసీబీలు, ట్రాలీల విషయమై వివిధ యజమానులు, కాంట్రాక్టర్లకు మధ్య అధికారులు అనుసంధానంగా వ్యవహరిస్తూ ప్రభుత్వ పనులకు కేటాయించాలని సూచించారు. అలాగే, దళితబంధు మొదటి దశలో యూనిట్లు విజయవంతంగా నడిపిస్తున్న లబ్ధిదారులకు రెండో దశ నిధులను విడుదల చేస్తామని భట్టి తెలిపారు. అంతేకాక యూనిట్ల పర్యవేక్షణకు ముగ్గురు జిల్లా స్థాయి అధికారులతో కమిటీని నియమించి, దుర్వినియోగం జరిగిన చోట ఆర్‌ఆర్ చట్టం ద్వారా నిధులు రికవరీ చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌ను డిప్యూటీ సీఎం ఆదేశించారు. గేదెలు, గొర్రెల యూనిట్లపై విచారణ జరిపించాలని సూచించారు. అనంతరం రైతువేదికలో భట్టి విక్రమార్క మొక్క నాటారు.డీఎఫ్ఓ సిద్ధార్థ్ విక్రమ్‌సింగ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఏలూరి శ్రీనివాసరావు, రాష్ట్ర హస్తకళల సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, ఎంపీపీ కోపూరి పూర్ణయ్య, జెడ్పీటీసీ పర్చగాని తిరుపతి కిషోర్, ఎంపీడీఓ రామయ్య, తహసీల్దార్ అనంతరాజు, ఎంపీఓ మల్లెల రవీంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ముదిగొండ : భట్టికి గజమాలతో స్వాగతం పలుకుతున్న నాయకులు

మహిళలకు రూ.లక్ష కోట్ల వడ్డీ లేని రుణాలు

ముదిగొండ: ఏటా రాష్ట్రంలోని మహిళలకు రూ.20వేల కోట్ల మేర వడ్డీ లేని రుణాలు ఐదేళ్ల పాటు అందజేస్తామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. ముదిగొండ మండలంలోని కమలాపురం, అయ్యగారిపల్లి, మల్లన్నపాలెంల్లో శనివారం అభివృద్ధి పనులు ప్రారంభించేందుకు వచ్చిన భట్టికి నాయకులు, కార్యకర్తలు గజమాలతో స్వాగతం పలికారు. అనంతరం కమలాపురం, అయ్యగారిపల్లిల్లో రూ.17కోట్లతో నిర్మించే బీటీ రోడ్లకు శంకుస్థాపన చేశాక మల్లన్నపాలెంలో రూ.22కోట్లతో నిర్మించిన 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ప్రారంభించారు. అనంతరం భట్టి విక్రమార్క మాట్లాడుతూ 24గంటలు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే కాక పేదలకు 200 యూనిట్ల మేర ఉచిత విద్యుత్ ఇస్తున్నామని తెలిపారు. త్వరలోనే రైతు కూలీలకు ఏటా రూ.12వేలు ఇవ్వడంతో పాటు అర్హులైన పేదలకు ఐదు లక్షల ఇళ్లు నిర్మిస్తామని చెప్పారు. కాగా, తమ హయాంలో జరుగుతున్న అభివృద్ధిని ఓర్వలేక ప్రతిపక్షాలు బురద జల్లే ప్రయత్నాలు చేస్తున్నాయని భట్టి విమర్శించారు. ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డితో పాటు డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ నాగేశ్వరరావు, పాలేరు షుగర్స్ మాజీ చైర్మన్ వనం నరసింగరావుతో పాటు ఆదినారాయణరెడ్డి, రమేష్, వనం ప్రదీప్తబాబు, వల్లూరి భద్రారెడ్డి, ఇలవల పుల్లారెడ్డి, పందిరి అంజయ్య, మట్టా బాబురాంరెడ్డి, వాక వెంకటేశ్వరెడ్డి, మరికంటి రామయ్య తదితరులు పాల్గొన్నారు.

కెనాల్‌తో 2లక్షల ఎకరాల సాగునీరు

వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు

ఏన్కూరు: సీతారామ లింక్ కెనాల్ ద్వారా ఉమ్మడి జిల్లాలోని 2లక్షల ఎకరాలకు సాగునీరు అందించవచ్చని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు వెల్లడించారు. ఏన్కూరు మండలం హిమామ్‌నగర్‌లో జరుగుతున్న లింక్ కెనాల్ పనులను శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. కెనాల్ నిర్మాణానికి భూమి ఇచ్చిన రైతులకు కృతజ్ఞతలు తెలిపిన మంత్రి.. అందరికీ ప్రభుత్వం నుంచి పరిహారం చెల్లిస్తామని చెప్పారు. కాగా, ఈనెలలోనే లింక్ కెనాల్‌ను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్న నేపథ్యాన పనుల్లో వేగం పెంచాలని అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, నాయకులు గుత్త వెంకటేశ్వరావు, మేడ ధర్మారావు, వాసిరెడ్డి నాగేశ్వరావు, శోభన్ నాయక్ పాల్గొన్నారు.



కెనాల్ పనులను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, నాయకులు

అంతర్జాతీయ ప్రమాణాలతో ఖమ్మం మార్కెట్

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో ఆధునీకరించనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. హైదరాబాద్‌లో శనివారం ఆయన ఆర్కిటెక్ట్ బృందం రూపొందించిన మార్కెట్ డిజైన్లను పరిశీలించి మాట్లాడారు. ప్రస్తుతం మార్కెట్‌లో 72వేల మిర్చి బస్తాల నిల్వ సామర్థ్యం ఉండగా దీన్ని 1.37 లక్షల బస్తాలకు పెంచేలా నిర్మాణాలు చేపడుతామని తెలిపారు. పర్యావరణ హితంగా సౌర విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుతో పాటు ఇతర సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.

పేదల సంక్షేమమే మా ధ్యేయం

- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- ఇస్లావత్‌తండా వద్ద 'భక్త రామదాసు' జలాల పరిశీలన

తిరుమలాయపాలెం: పేదల సంక్షేమమే కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. తిరుమలాయపాలెం మండల పరిషత్ కార్యాలయంలో 101 మందికి శనివారం ఆయన రూ.28లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ వైద్యం చేయించుకునే స్థోమత లేని పేదల కోసం సీఎంఆర్ఎఫ్ ద్వారా నిధులు మంజూరు చేయిస్తున్నట్లు తెలిపారు. ఇకపై లబ్ధిదారులకు గ్రామాల్లోనే చెక్కులు అందిస్తామన్నారు. పాలేరు నియోజకవర్గంలోని నాలుగు మండలాలు తనకు నాలుగు కళ్లు అని.. అన్ని ప్రాంతాల అభివృద్ధే ధ్యేయమని చెప్పారు. తిరుమలాయపాలెంలోని సీహెచ్‌సీ తరలిస్తున్నారన్న అపోహలు నమ్మొద్దని.. దీనికి తోడు మాతాశిశు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. అలాగే, యువతకు ఉపాధి అవకాశాలను మెరుగు పర్చేలా ఐటీఐ మంజూరు చేశామని చెప్పారు. షాపింగ్ కాంప్లెక్స్, పబ్లిక్ టాయిలెట్ల ఏర్పాటుతో పాటు మాదిగ కులస్తులకు భవన నిర్మాణానికి స్థలం కేటాయించనున్నట్లు తెలిపారు. అనంతరం ఇస్లావత్‌తండా వద్ద భక్తరామదాసు ప్రాజెక్టు ద్వారా ఎత్తిపోస్తున్న పాలేరు జలాలకు మంత్రి పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆర్‌డీఓ గణేష్ తహసీల్దార్ పీ.వీ.రామకృష్ణ, ఎంపీడీఓ సిలార్‌సాహెబ్, ఎంపీపీలు మంగీలాల్, బి.శ్రీనివాస్, జెడ్పీటీసీ బెల్లం శ్రీనివాస్, నాయకులు తుంబూరు దయాకర్‌రెడ్డి, స్వర్ణకుమారి, రామసహాయం నరేష్‌రెడ్డి, అశోక్, చావా శివరామకృష్ణ, జూకూరి గోపాల్‌రావు, బి.వెంకటరెడ్డి, కె.అశోక్ తదితరులు పాల్గొన్నారు.



భక్త రామదాసు పథకం జలాలకు పూజ చేస్తున్న మంత్రి పొంగులేటి

క్లుప్తంగా

బిల్లుపాడు స్కూల్‌ను దత్తత తీసుకున్న ఎన్‌ఆర్‌ఐలు

తల్లాడ: మండలంలోని బిల్లుపాడు జెడ్పీహెచ్ఎస్, ప్రాథమిక పాఠశాలను దత్తత తీసుకుంటున్నట్లు ఎన్‌ఆర్‌ఐలు ప్రకటించారు.ఈ మేరకు తానా అధ్యక్షుడు కొడాలి నరేన్, మాజీ అధ్యక్షుడు వేమన సతీష్‌తో పాటు జక్కంపూడి రాముతో కూడిన ఎన్‌ఆర్‌ఐల బృందం శని వారం పాఠశాలను సందర్శించింది. పాఠశాలలో మాజీ సర్పంచ్ జక్కంపూడి కృష్ణమూర్తి నేతృత్వాన అభివృద్ధి జరగగా మరిన్న సౌకర్యాలు కల్పించేందుకు తాము దత్తత తీసుకుంటున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎంలు జోజప్ప, దిరిశాల వెంకట్రామయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగ్గురు ఏఈఓల బదిలీ

ఖమ్మంవ్యవసాయం: వ్యవసాయ శాఖలో ఉద్యోగుల బదిలీల ప్రక్రియ శనివారం ప్రారంభమైంది. రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ డాక్టర్ గోపి ఆన్‌లైన్‌లో కౌన్సెలింగ్ నిర్వహించగా జిల్లా ఉద్యోగులు వీ.వీ.పాలెంలోని రైతు వేదిక నుంచి పాల్గొన్నారు. తొలిరోజు గ్రేడ్–1 ఏఈఓల బదిలీలు చేపట్టగా జిల్లాలో ముగ్గురికి స్థానచలనం కలిగింది. ఖమ్మం రూరల్ మండలం గుర్రాలపాడు క్లస్టర్ ఏఈఓ మారుతి వెంకటేశ్వర్లును ఖమ్మం అర్బన్ మండలం మల్లెమడుగుకు, సత్తుపల్లి మండలం కొత్తూరు ఏఈఓ సత్యభాస్కర్‌ను కామేపల్లి మండలం కొమ్మినేపల్లికి, నేలకొండపల్లి మండలం రాజేశ్వరిపురం నుంచి వెంకటేష్‌ను రఘునాథపాలెం మండలం మంచుకొండకు బదిలీ చేశారు. ఆతర్వాత గ్రేడ్–2 ఏఈఓలు 30మందికి బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఏఓ ఎం.విజయనిర్మల, ఏడీఏలు విజయ్‌చందర్, శ్రీనివాస్, బి.సరిత తదితరులు పాల్గొన్నారు.

సీఎం వ్యాఖ్యలు గర్హనీయం

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ ఉపాధ్యాయుల పదోన్నతుల అభినందన సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రైవేట్ టీచర్లపై చేసిన వ్యాఖ్యలు సరికాదని తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ ఫోరం(టీపీటీఎఫ్) జిల్లా అధ్యక్షుడు కొరకొప్పు రామారావు పేర్కొన్నారు. ఖమ్మంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంటర్, డిగ్రీ ఫెయిల్ అయిన వారే ప్రైవేట్ టీచర్లుగా కొనసాగుతున్నారని చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో మనోహర్, రమణ, సుజాత, చౌహాన్, సరిత తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ పరేడ్‌కు సింగారెడ్డిపాలెం గురుకుల విద్యార్థిని


విద్యార్థిని అభినందిస్తున్న ప్రసాద్‌రెడ్డి

నేలకొండపల్లి: నేలకొండపల్లి మండలం సింగారెడ్డిపాలెంలోని గురుకుల పాఠశాల విద్యార్థిని వి.గ్రేషితకు అరుదైన అవకాశం లభించింది. ఈనెల 15న ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగే స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు రావాలని ఆమెకు ఆహ్వానం అందింది. గురుకులంలో పదో తరగతి చదువుతున్న గ్రేషిత ఇటీవల ప్రేరణ కార్యక్రమంలో భాగంగా గుజరాత్‌లోని ప్రధాని మోదీ నివాసంలో శిక్షణ పొందారు. ఈనేపథ్యాన పంద్రాగస్టు వేడుకలకు రావాలని అధికారులు లేఖ పంపించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ పద్మావతి మాట్లాడుతూ గ్రేషితతో పాటు ఉపాధ్యాయురాలు ఢిల్లీ వెళ్లనున్నారని తెలిపారు. విద్యార్థినిని కాంగ్రెస్ నాయకుడు పొంగులేటి ప్రసాద్‌రెడ్డి, గురుకులాల జోనల్ ఆఫీసర్ కె.స్వరూపరాణి, ఉద్యోగులు పాకనాటి కన్నారెడ్డి తదితరులు అభినందించారు.

51మంది టీచర్ల సర్దుబాటు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో సబ్జెక్టు టీచర్లు ఎక్కువగా ఉన్న పాఠశాలల నుంచి అవసరమైన చోటకు 51మందిని సర్దుబాటు చేశారు. పాలేరు నియోజకవర్గంతో పాటు ఖమ్మంలోని ఎన్నెస్పీ కాలనీ హైస్కూల్, ఇందిరానగర్, రోటరీనగర్, రిక్కాబజార్ పాఠశాలలకు పలువురు ఉపాధ్యాయులను కేటాయించినట్లు డీఈఓ సోమశేఖరశర్మ తెలిపారు.

డైట్‌లో సర్టిఫికెట్ల పరిశీలన

డీఈఈసెట్ అభ్యర్థుల ధృవపత్రాల పరిశీలన డైట్ కళాశాలలో కొనసాగుతోందని ప్రిన్సిపాల్ సామినేని సత్యనారాయణ తెలిపారు.

ఎంఆర్‌టీని సందర్శించిన సీఎండీ

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మంలోని ఇల్లెందు క్రాస్‌లో ఉన్న ఎంఆర్టీ డివిజన్ కార్యాలయాన్ని ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా మీటర్ టెస్టింగ్ బెంచ్ పనితీరును పరిశీలించారు. అక్కడ నుంచి ముదిగొండ మండలం పమ్మిలో నిర్మించిన 132/33 కేవీ సబ్ స్టేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి సీఎండీ బయలుదేరారు. ఆయన వెంట ఖమ్మం సర్కిల్ ఎస్ఈ సురేందర్, డీఈలు, ఏడీఈలు ఉన్నారు.

ఉరి వేసుకుని ఆత్మహత్య

మధిర: మధిరలోని ఓ ఇంట్లో వ్యక్తి శనివారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వరంగల్‌లోని ఒక ప్రైవేట్ చిట్‌ఫండ్ కంపెనీలో పనిచేస్తున్నట్లు భావిస్తున్న మాచర్ల ప్రవీణ్(32)కు భార్య, పిల్లలు ఉన్నారు. ఆయన శుక్రవారం సాయంత్రం మధిరలో ఉంటున్న తన సోదరుడు నవీన్ ఇంటికి వచ్చాడు. అయితే, హోటల్ పనిచేసే నవీన్ ఇంటికి చేరుకునే సరికి ప్రవీణ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆయన బలవన్మరణానికి కారణాలు తెలియకపోగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఆపత్కాలంలో అండదండలు

▶ సహచరుల కుటుంబాలకు స్నేహితుల చేయూత ▶ అనారోగ్య పరిస్థితుల్లో చికిత్సకు ఆర్థిక సాయం ▶ స్నేహబంధాన్ని చాటుతున్న పలువురు



పాఠశాల.. కళాశాల.. ఉద్యోగం.. ఇలా దశలు మారేకొద్దీ స్నేహితుల సంఖ్య పెరుగుతుంటుంది. ఎప్పటికప్పుడు జాబితాలోకి కొత్త స్నేహితులు వచ్చి చేరతారు. అయితే, ఏ స్థాయికి ఎదిగినా.. ఎక్కడ ఉన్నా చదువుకున్నప్పటి స్నేహాన్ని పలువురు కొనసాగిస్తున్నారు. శుభకార్యాలకు హాజరై సంతోషాన్ని పంచుకోవడమే కాక ఆపద ఎదురైనప్పుడూ అంతా కలిసి సహచరులకు అండగా నిలిచి మేమున్నామని స్నేహబంధాన్ని చాటుతున్నారు. నేడు స్నేహితుల దినోత్సవం సందర్భంగా అలాంటి బృందాల్లో కొన్నింటి వివరాలు ....

ఖమ్మం క్రైం/రఘునాథపాలెం/సత్తుపల్లి టౌన్/కల్లూరు/తల్లాడ

తల్లాడ జెడ్పీహెచ్ఎస్.. 1995-96

తల్లాడ జెడ్పీహెచ్ఎస్ 1995–96 బ్యాచ్ విద్యార్థులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈమేరకు ఇటీవల గుడిపల్లి సైదులు, దొనకొండ నరసింహారావు, ఎండీ.ఫిరోజ్ ఆధ్వర్యాన నగదు సేకరించి తమ స్నేహితురాలు కాంపల్లి వెంకటనరసమ్మ భర్త ముత్తయ్య చికిత్స కోసం రూ.30 వేలు అందించారు. అలాగే, తమతో చదివి మృతి చెందిన గుడిపల్లి బాలస్వామి, అంకోలు రామారావు కుటుంబాలకు రూ.20వేల చొప్పున, స్నేహితుడు బొడ్డు రామకృష్ణ భార్య చికిత్సకు రూ.20వేలు అందించడమేకాక ఆర్థికంగా వెనుకబడిన మరో మిత్రురాలికి రూ.20వేలు సమకూర్చారు.



ఐదేళ్లలో 67 కుటుంబాలకు చేయూత

రఘునాథపాలెం మండలం బూడిదంపాడుకు చెందిన మిత్రులు 2019లో హెల్పింగ్ హ్యాండ్స్ పేరుతో వాట్సాప్ గ్రూపు ఏర్పాటుచేసుకున్నారు. ఈ సందర్భంగా ఎవరైనా చనిపోయినా, ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నా ఈ గ్రూప్ ద్వారా సమాచారం చేరవేసి తలా కొంత నగదు జమ చేస్తున్నారు. 2019 నుండి ఇప్పటి వరకు 67 మంది కుటుంబాలకు రూ.5.10 లక్షల ఆర్థిక సయం అందించడం విశేషం.



తల్లాడ జెడ్పీహెచ్ఎస్.. 1988-89



2023 మార్చిలో 1988–89 బ్యాచ్ తల్లాడ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు సమావేశమవగా పూర్వ ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలను ఆదుకోవాలని మొక్కా రాంబాబు, దగ్గుల కరుణాకర్‌రెడ్డి, పోలూరి నాగేశ్వర్‌రావు, సంపత్‌కుమార్ ఆధ్వర్యాన నిర్ణయించారు. దీంతో తల్లాడకు చెందిన దగ్గుల జితేందర్‌రెడ్డి మృతి చెందగా ఆయన కుటుంబానికి రూ.40 వేలు, బిల్లుపాడుకు తొర్లపాటి సంతోష్ భార్య అనారోగ్యంతో మృతి చెందగా ఆయన కుమార్తె చదువుల నిమిత్తం రూ.20 వేలు అందించి అండగా నిలిచారు.

సత్తుపల్లి ఎస్‌బీఎస్.. 1984-85



స్నేహితులెవరైనా ఆపదలో ఉంటే అండగా నిలుస్తున్నారు. సత్తుపల్లి శ్రీబండి శోభనాచలం హైస్కూల్ (ఎస్‌బీఎస్) 1984–85 బ్యాచ్ పూర్వ విద్యార్థులు. ఈ బ్యాచ్‌కు చెందిన 25 మంది కలిసి తమ మిత్రుడి కుమార్తె వివాహానికి మేనమామల్లా నిలిచారు. 2020 మే 24న జరిగిన వివాహానికి రూ.1,31,500 సమకూర్చారు. అలాగే, మరో మిత్రుడు మృతి చెందగా 2021 మే 16న నిత్యావసర సరుకులతో పాటు రూ.31వేల నగదు అందించారు. ఈ బ్యాచ్‌లో ఎం.డీ.ముక్తార్, ఎం.డీ.షాకీర్, ఎం.డీ.షైబుద్దీన్, ఆర్.శ్రీను, ఎం.డీ.రియాజుద్దీన్ తదితరులు ఉన్నారు.

ఒకరికి ఒకరు అండగా..



పోలీస్ శాఖలోని 2003 బ్యాచ్ కానిస్టేబుళ్లు సోదర భావంతో ఉంటూ అవసరమైన వారికి చేయూతనిన్నారు. బ్యాచ్‌లో కన్నుమూసిన కానిస్టేబుళ్ల కుటుంబాలకు సహచరులు ఆర్థికంగా అండగా నిలిచారు. 2022లో కానిస్టేబుల్ షేక్ సుబాన్ మృతి చెందగా ఆయన కుటుంబానికి అంతా కలిసి రూ.2.47 లక్షల ఆర్థికసాయంగా అందజేశారు. ఇదే బ్యాచ్‌కు చెందిన వెంకయ్య, నర్సింహారావు, శ్రీహరి కుటుంబాలకు సైతం అండగా నిలిచారు.

అండగా ఉండే వాడే నిజమైన ఫ్రెండ్

ఖమ్మంవన్‌టౌన్: అవసరమైన సమయంలో ఒకరికొకరు సాయం చేసుకునే వారే నిజమైన స్నేహితులన్న మాటను నేను వంద శాతం నమ్ముతాను. మా నాన్న ఉద్యోగ రీత్యా నేను వివిధ ప్రాంతాల్లో చదవడంతో నాకు ఫ్రెండ్స్ తక్కువగానే ఉన్నారు. కానీ 3వ తరగతి క్లాస్‌మేట్ చందన్ నా బెస్ట్ ఫ్రెండ్. వీలు దొరికినప్పుడల్లా ఇద్దరం ఇప్పటికీ కలుస్తాం. మేం లక్నోలో ఉన్నప్పుడు వారానికొకసారైనా చందన్ వచ్చేవాడు. చదువుకునే రోజుల్లో తనకు తెలిసిన జ్ఞానాన్ని పంచేవాడు. నాకు వైఫల్యాలు ఎదురైన ప్రతీసారి ఆయన నుంచి ప్రేరణ పొందా. చందన్ ఇచ్చిన భరోసా నాలో పట్టుదలను పెంచి ఈ స్థాయికి చేర్చింది.


స్నేహితుడు చందన్‌తో డీఎఫ్‌ఓ సిద్ధార్థ్

– సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, జిల్లా అటవీశాఖ అధికారి

కల్లూరు.. 1985-86 బ్యాచ్



కల్లూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1985–86 బ్యాచ్ విద్యార్థులకు తమ సహచరులకు ఆపద ఎదురైతే అండగా నిలుస్తూ స్నేహధర్మాన్ని చాటుతున్నారు. గత ఏడాది కల్లూరు శాంతినగర్‌కు చెందిన ఖమ్మంపాటి వెంకటేశ్వరరావుకు ఒక కాలు కోల్పోగా మిత్రులు రూ.70 వేలు అందజేశారు. అలాగే, మిట్టపల్లికి చెందిన అబ్బూరామ్ పిల్లలు మెడిసిన్, పీజీ చదువుతుండగా రూ.50 వేలు అందించారు. ఈ బ్యాచ్‌లో వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు, ఇతర రంగాల్లో స్థిరపడిన శీలం శ్రీనివాస్, గడల లక్ష్మణరావు, కొమ్మూరి శ్రీనివాస్, రావిలాల రాంబాబు, ఎండీ.మౌలాలి, వల్లపునేని సత్యవాణి, కాశెట్టి విజయ, గుర్రం శ్రీనివాస్, దచాల కిషోర్‌దత్, మేరుగు వేలాద్రి, కొప్పరపు బలరామ్, గంగుల గోపి తదితరులు ఉన్నారు.

2007 బ్యాచ్ హోంగార్డులు



కష్టాల్లో ఉన్న తమ సహచరులకు చేయూతనిస్తున్నారు 2007 బ్యాచ్‌కు చెందిన హోంగార్డులు. ఈ బ్యాచ్‌లో మొత్తం 90మంది హోంగార్డులు ఉండగా.. ఎవరికి అనారోగ్యం ఎదురైనా, ఇతర ఇబ్బందులు ఉన్నా శక్తి మేర ఆర్థిసాయం చేస్తూ అండగా నిలుస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల్ల పనిచేస్తున్న వీరు వాట్సప్ గ్రూప్ ద్వారా సమాచారం ఇచ్చిపుచ్చుకుంటారు.

ఐదేళ్ల పదవీకాలం సంతృప్తి ఇచ్చింది...

జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజు


జెడ్పీచైర్మన్ కమల్‌రాజు

ఖమ్మంవన్‌టౌన్: జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఐదేళ్ల పదవీకాలం సంతృప్తిని ఇచ్చిందని లింగాల కమల్‌రాజ్ తెలిపారు. ఈనెల 6వ తేదీతో చైర్మన్ పదవీకాలం ముగియనున్న సందర్భంగా శనివారం ఆయన జెడ్పీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గత పాలకవర్గ సమావేశాలు పోలీసు బందోబస్తు జరిగితే ఈ ఐదేళ్లలో అలాంటి సందర్భం రాలేదన్నారు. ప్రతిపక్ష సభ్యులను సైతం చిన్నచూపు చూకుండా అందరికీ సమానంగా నిధులు కేటాయించామని తెలిపారు. కరోనా కష్టకాలంలో ప్రజలకు సేవచేసే అవకాశం తమకు లభించిందని చెప్పారు. జెడ్పీటీసీ సభ్యులు వలస కూలీల వద్దకు సైతం వెళ్లి రేషన్ అందించారని, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి చైర్మన్‌గా తాను కోవిడ్ సమయాన వైద్యులను సమన్వయం చేశానని తెలిపారు. కొత్త జిల్లాలో తొలి జెడ్పీ చైర్మన్‌గా అవకాశం దక్కించుకున్న తాను కారుణ్య నియామకాలను అవినీతికి తావు లేకుండా పూర్తిచేశానని కమల్‌రాజ్ వెల్లడించారు. గత ప్రభుత్వంలోని ఎమ్మెల్యేలు, మంత్రి అజయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, ఎమ్మెల్సీ తాతా మధు సహకరించారని.. ప్రస్తుత ఎమ్మెల్యేలు, మంత్రులు సైతం అండగా నిలిచారని చెప్పారు. జెడ్పీ సాధారణ నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులు, స్టేట్ మ్యాచింగ్ గ్రాంట్లు, ఎంజీ ఎన్ఆర్ఈజీఎస్ నిధులు, మినరల్ ఫండ్స్‌తో జిల్లాలో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించగా.. జెడ్పీ ప్రాంగణంలో గాంధీ, అంబేద్కర్ విగ్రహాలు ఏర్పాటుచేశామని కమల్‌రాజ్ తెలిపారు. కాగా, సోమవారం చివరి సర్వసభ్య సమావేశం జరగనుందని ఆయన వివరించారు.

అధికారుల అండదండలతోనే..

టౌన్‌ప్లానింగ్ నియామకాల్లో వారే కీలకం?



ఖమ్మంమయూరిసెంటర్: వడ్డించే వాడు మనవాడైతే బంతిలో ఎక్కడ కూర్చున్నా అన్నీ అందుతాయనే నానుడి ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో నిజమవుతోంది. అధికారుల అండదండలతో కాల పరిమితి ముగిసినా.. కొందరు ఉద్యోగంలో కొనసాగుతుండగా.. కౌన్సిల్, మేయర్ అనుమతి లేకున్నా వేతనాలు అందుతున్నాయి. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లోని టౌన్ ప్లానింగ్ విభాగంలో ఎల్‌ఆర్ఎస్ పనుల కోసం గతంలో పది మంది సిబ్బందిని అధికారులు నియమించుకున్నారు. ఆ సమయాన కనీసం మేయర్ ఆమోదం కూడా లేకపోగా, వారి విషయమై కేఎంసీలో ఇటీవల జరుగుతున్న చర్చతో ఆసక్తికర విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఎల్ఆర్ఎస్ పని పూర్తయ్యాక తొలగించకపోగా ఏ విధానంలో వారిని నియమించరో తెలియకుండా అగ్రిమెంట్లపై సంతకాలు చేసిన అధికారుల తీరు విమర్శలు తావిస్తోంది.

నియామకం ఒకటి.. పని మరొకటి..

ఎల్‌ఆర్‌ఎస్‌కు సంబంధించి దరఖాస్తుల పరిశీలన కోసం టౌన్‌ప్లానింగ్ అధికారులు పది మందిని నియమించగా అందులో ఇప్పుడు తొమ్మిది మంది కొనసాగుతున్నారు. వీరిని రోజువారీ వేతనంపై నియమించినట్లు చెబుతున్నా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల పరిశీలన కాకుండా ఇతర పనులు అప్పగించినట్లు సమాచారం. దీంతో ఒకరిద్దరు తమను నియమించిన అధికారుల అండతో చెలరేగిపోతున్నట్లు తెలిసింది. అయితే, వీరి నియామకాలు, వేతనాల చెల్లింపు అగ్రిమెంట్లపై అధికారుల సంతకాలు తప్ప మేయర్ సంతకం కానీ కౌన్సిల్ ఆమోదం కానీ లేదు. దీంతో వేతనాల చెల్లింపు కోసం ఓ అధికారి వద్దకు ఫైల్ వెళ్లిన సందర్భంలో వెనక్కి పంపితే ఇన్నాళ్లు ఎలా సంతకం పెట్టారని ఇంకో అధికారి నిలయడంతో వాగ్వాదం జరిగినట్లు సమాచారం. ఇదే సమయాన అధికారులు కమిషనర్‌ను తప్పుదోవ పట్టించి సంతకాలు చేయించారనే చర్చ జరుగుతుంది. కాగా, నియామకాలపై మేయర్ విచారణ చేయించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. కానీ అధికారులు మాత్రం 'మీకేం కాదు.. మేం చేసుకుంటాం' అని సిబ్బందికి ధైర్యం చెబుతున్నట్లు సమాచారం.

మెరుగైన వైద్యసేవలు అందించాలి

డీఎంహెచ్ఓ మాలతి, డీసీహెచ్ఎస్ రాజశేఖర్‌గౌడ్


వైద్యులతో సమీక్షిస్తున్న డీఎంహెచ్ఓ మాలతి, డీసీహెచ్ఎస్ రాజశేఖర్‌గౌడ్

తిరుమలాయపాలెం: వైద్యులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటున్న మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి మాలతి, జిల్లా వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల సూపరింటెండెంట్ డాక్టర్ రాజశేఖర్‌గౌడ్ ఆదేశించారు. తిరుమలాయపాలెం సీహెచ్‌సీని సందర్శించిన వారు వైద్యులతో సమావేశమయ్యారు. వైద్యసేవలు, జ్వరాల తీవ్రత, డెంగీ కేసుల నమోదు, ఆస్పత్రికి కావాల్సిన సదుపాయాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ, డీసీహెచ్ఎస్ మాట్లాడుతూ వైద్యులు సమయపాలన పాటిస్తూ వైద్యసేవలు అందించాలని, జ్వరాల తీవ్రత ఉన్న గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించాలని తెలిపారు. కాగా, సీహెచ్‌సీలో అదనపు పడకల ఏర్పాటు, మరో ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్టును నియమించాలని కోరగా డీసీహెచ్ఎస్ సానుకూలంగా స్పందించారు. అనంతరం ఆస్పత్రిలో చెత్త తొలగింపు పనులను పరి శీలించారు. పీహెచ్‌సీ, సీహెచ్‌సీ డాక్టర్లు బొల్లికొండ శ్రీనివాసరావు, బొడ్డు వెంకటేశ్వర్లు, సూరజ్‌కిరణ్, అలివేలు, ఉద్యోగులు ఆర్.వీ.ఎస్.ప్రసాద్ పాల్గొన్నారు.

సీట్లు, ఓట్లు తగ్గినా సిద్ధాంతానిదే విజయం

నేలకొండపల్లి: దేశ రక్షణ కోసమే కమ్యూనిస్టులు పోరాడుతున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం వెల్లడించారు. మండలంలోని మోటాపురంలో శనివారం నిర్వహించిన సీపీఎం నాయకుడు చావా లెనిన్ సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో గెలుపోటములు, సీట్లు, ఓట్లు కమ్యూనిస్టుల బలానికి కొలమానం కాదని చెప్పారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా కమ్యూనిస్టు సిద్ధాంతమే గెలుస్తోందని తెలిపారు. కాగా, కేంద్ర బడ్జెట్‌లో పేదలను విస్మరించిన బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్లకు మాత్రం పెద్దపీట వేసిందని ఆరోపించారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర నాయకుడు భాగం హేమంతరావుతో పాటు సీపీఎం నాయకులు ఇంటూరి అశోక్, శ్రీనివాసరావు, గుడవర్తి నాగేశ్వరరావు, కే.వీ.రెడ్డి, రచ్చా నర్సింహారావు, భూక్యా కృష్ణ, బెల్లం లక్ష్మి, ఏటుకూరి రామారావు, తాళ్లూరి రవి, తోటకూరి రాజశేఖర్, మారుతి కొండలరావు, ఎడ్ల తిరపతిరావు, పెద్దిరాజు నర్సయ్య పాల్గొన్నారు.

ఎంసీహెచ్‌లో అత్యధిక డెలివరీలు

● ఒకేరోజే 34 ప్రసవాలు చేసిన వైద్యులు


కేక్ కట్ చేస్తున్న ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రం (ఎంసీహెచ్)లో తొలిసారి శనివారం అత్యధిక ప్రసవాలు నిర్వహించారు. గత ఏడాది నవంబర్‌లో వైద్య విధాన పరిషత్ నుండి డీఎంఈ పరిధిలోకి రాగా.. ఒకేరోజు అత్యధికంగా 34 డెలివరీలు నిర్వహించడం ఇదే మొదటిసారి. ఇందులో ఇందులో 20 సాధారణ, 14 శస్త్రచికిత్సలు ఉన్నాయి. ఈసందర్భంగా సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్, ప్రిన్సిపాల్ ఎస్.రాజేశ్వరరావు, ఆర్‌ఎంఓ డాక్టర్ రాంబాబు, డిప్యూటీ సూపరింటెండెంట్ బి.కిరణ్‌కుమార్ కేక్ కట్ చేసి వైద్యులు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. గైనిక్ అసిస్టెంట్ ప్రొఫసర్ డాక్టర్ అస్ర, సీనియర్ రెసిడెంట్ వైద్యులు మీనా, డీఆర్‌పీ సంధ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభకు వెళ్లొచ్చే సరికి టీచర్ ఇంట్లో చోరీ


సత్తుపల్లిటౌన్: ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించిన సందర్భంగా హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన సభకు వెళ్లొచ్చే సరికి ఓ ఉపాధ్యాయ దంపతుల ఇంట్లో చోరీ జరిగింది. మండలంలోని గంగారం హైస్కూల్ ఉపాధ్యాయుడు షేక్ అలీమ్, మండంలోని తుంబూరు హైస్కూల్ పీడీ మాలిన్ దంపతులు సీఎం రేవంత్‌రెడ్డి సభకు శుక్రవారం తెల్లవారుజామున వెళ్లి శనివారం తెల్లవారుజామున వచ్చారు. అప్పటికే ఇంటి తాళం పగులగొట్టి ఉండడంతో లోపల పరిశీలించగా బీరువాలో భద్రపర్చిన ఆరు తులాల బంగారంతో పాటు రూ.లక్ష నగదు చోరీ జరిగినట్లు గుర్తించారు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు క్లూస్ టీమ్ బృందంతో పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

చింతకాని: మండలంలోని రామకృష్ణాపురానికి చెందిన కలకుంట్ల కరుణాకర్ (40) శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆర్థిక ఇబ్బందులతోనే ఆయన ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

చికిత్స పొందుతున్న బాలిక మృతి

● ఆస్పత్రి వద్ద తల్లిదండ్రులు, బంధువుల ఆందోళన


సన తబూసం (ఫైల్)

సత్తుపల్లిటౌన్: ప్లేట్‌లేట్లు పడిపోవడమే కాక విరోచనాలతో బాధపడుతుండగా ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించిన బాలిక చికిత్స పొందుతూ మృతి చెందింది. దీంతో వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ కుటుంబీకులు, బంధువులు శనివారం రాత్రి ఆందోళనకు దిగారు. సత్తుపల్లి మండలం రేగళ్లపాడుకు చెందిన ఆటో డ్రైవర్ సయ్యద్ ఉస్మాన్‌పాషా – సబీహా కుమార్తె సన తబూసం(15) దమ్మపేట మండలం నాగుపల్లి హైస్కూల్‌లో పదో తరగతి చదువుతోంది. ఆమె శుక్రవారం నుంచి విరోచనాలతో బాధపడుతూ నీరసపడటంతో బుగ్గపాడులోని ఆర్‌ఎంపీ వద్ద శనివారం ఉదయం వరకు చికిత్స చేయించారు. ఇంతలోనే ప్లేట్‌లెట్లు, బీపీ తగ్గగా ఆర్‌ఎంపీ సత్తుపల్లిలోని విజేత ఆస్పత్రి వైద్యుడికి ఫోన్ చేసి ఇక్కడకు తీసుకొచ్చారు. ఆకస్మాత్తుగా శనివారం రాత్రి పరిస్థితి విషమంగా ఉందని ఖమ్మం ఆస్పత్రికి తీసుకెళ్లాలంటూ తబూసంను అంబులెన్స్‌లోకి ఎక్కించారని.. అప్పటికే బాలిక మృతి చెందిందని తల్లిదండ్రులు ఆరోపించారు. ఇందుకు వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆందోళనకు దిగగా సీఐ కిరణ్ చేరుకుని నచ్చచెప్పారు. కాగా, ఆస్పత్రి వైద్యుడు సాగర్ మాట్లాడుతూ బాలికకు ప్లేట్‌లెట్లు, బీపీ తగ్గడమే కాక డెంగీతో అంతర్గత అవయవాలు దెబ్బతిన్నాయని తెలిపారు. ఈ కారణంగానే తబూసం మృతి చెందిందని తెలిపారు.